నిధులు లేక నిలిచిన నిర్మాణం

- పెర్కిట్‌లో అసంపూర్తిగా సమీకృత మార్కెట్ భవనం పనులు
- పట్టించుకోని అధికారులు


పెర్కిట్‌లో పిల్లర్ల దశలోనే నిలిచిన మార్కెట్ పనులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు నిధుల లేమితో నిలిచిపోయాయి. కూరగాయలు, పండ్లు, మాంసం విక్రయాలు ఒకేచోట నిర్వహించాలన్న సంకల్పంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో గత ప్రభుత్వ హయాంలోనే పెర్కిట్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణానికి టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.7కోట్ల 20లక్షల ప్రత్యేక నిధులు కేటాయించారు. అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి 2023 ఆగష్టు 14నా నిర్మాణ పనులను ప్రారంభించారు. తొలి దశలో పనులు వేగవంతంగా జరిగాయి. ప్రభుత్వం మారడంతో నిధులు విడుదల కాలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులను పిల్లర్ల దశలోనే నిలిపి వేశారు.

రోడ్లపైనే విక్రయాలు..

పెర్కిట్ జాతీయ రహదారుల కూడలిగా ఉండడంతో కూరగాయాల మార్కెట్ నిత్యం రద్దీగా ఉంటోంది. కాగా మార్కెట్‌లో సౌకర్యాలు లేక పోవడంతో రైతులు, వ్యాపారులు రోడ్డుపైనే కూరగాయాలను విక్రయిస్తున్నారు. పరిసర మండలాలు అయిన బాల్కొండ, వేల్పూర్, జక్రాన్‌పల్లి మండలాలకు చెందిన రైతులు తాము పండించిన కూరగాయలను పెర్కిట్‌కు తీసుకు వచ్చి విక్రయిస్తుంటారు. అలాగే హోల్‌సేల్ వ్యాపారం సైతం కొనసాగుతోంది. వ్యాపారులు ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుని హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటారు. దీంతో శుభకార్యాలకు, నిత్యవసరాలకు కూరగాయల కొనుగోలు కోసం వచ్చేవారి వాహనాలతో రహదారి ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో రహదారిపై ట్రాఫిక్ సమస్య నెలకొంది. అలాగే ఎలాంటి షెడ్డు లేకపోవడంతో వ్యాపారులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ నిర్మాణం పూర్తయితే సౌకర్యంగా ఉంటుందని భావించిన రైతులు, వ్యాపారులకు పనులు నిలిచిపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

నిధులు రాగానే పనులు చేపడతాం..

నిధులు లేకపోవడంతో నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే పెర్కిట్‌లోని సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభిస్తాం. అలాగే కూరగాయాల మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం. – రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

నిధుల దుర్వినియోగం ఆరోపణలు నిరాధారం


మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ సొసైటీలో రూ.30 లక్షల నిధులు దుర్వినియోగం జరిగాయన్న వినోద్ రెడ్డి ఆరోపణలు నిరాధారమైనవని సొసైటీ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి స్పష్టం చేశారు. అంకాపూర్ సొసైటీలో సోమవారం ఆయన మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ.. 2019లో అప్పటి డీసీవో సింహాచలం అనుమతి తీసుకుని పాత గోదామును బహిరంగ వేలం ద్వారా రూ.30 లక్షలకు విక్రయించినట్లు తెలిపారు. విక్రయించగా వచ్చిన డబ్బుల నుంచి రూ.21లక్షలను మార్క్‌ఫెడ్ బకాయిలకు అలాగే సొసైటీ భవన రుణానికి రూ.11లక్షలు చెల్లించినట్లు పేర్కొన్నారు. దీంతోపాటు సొసైటీలో సౌకర్యాల కల్పనకు రూ.లక్ష వినియోగించినట్లు వెల్లడించారు. రాష్ట్ర చైర్మన్ రాష్ట్ర పర్యటనలో బిజీగా ఉండడం వల్ల సమావేశం రెండు నెలలు ఆలస్యమైనట్లు తెలిపారు. అనంతరం సొసైటీ కార్యదర్శి శ్యామ్ సొసైటీ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించగా పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సొసైటీ ఆదాయ, వ్యయాలను మానిటరింగ్, క్లస్టర్ అధికారిణి స్వప్న, ఆడిటర్ రవీందర్ సింగ్ పరిశీలించారు. నివేదికను డీసీవోకు అందజేయనున్నట్లు తెలిపారు. నాయకులు కిషోర్‌రెడ్డి, గంగారెడ్డి, డైరెక్టర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల వద్ద భద్రత ఏర్పాటు చేసుకోవాలి


నందిపేటలో మాట్లాడుతున్న ఎస్సై చిరంజీవి

నందిపేట్(ఆర్మూర్): నందిపేట, డొంకేశ్వర్ మండలాల పరిధిలోని ఎత్తిపోతల పథకాల వద్ద వాచ్‌మెన్, సీసీ కెమెరాలతో భద్రతను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై చిరంజీవి సూచించారు. నందిపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం నందిపేట, డొంకేశ్వర్ మండలాల పరిధిలోని ఎత్తిపోతల పథకం చైర్మన్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎత్తిపోతల పథకం పంపుహౌజ్‌ల వద్ద దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

క్లుప్తంగా

అర్హులందరికీ రేషన్ కార్డులు అందించాలి



బోధన్: మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో అర్హులైన దరఖాస్తుదారులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతి పత్రం అందించారు. గ్రామంలో మూడు వందల మందికి పైగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం 68 మందికి మాత్రమే రేషన్ కార్డు జాబితాలో పేర్లు వచ్చాయని నాయకులు అన్నారు. నాయకులు సిర్ప సుదర్శన్, ప్రవీణ్, నమిళ్ల శ్రీనివాస్, లింగం, ఉప్పరి శివ, నీరడి బాబురావు, సాయి , ఆరే పవన్, సిర్ప ప్రశాంత్, మల్లెపూల సాయి, గాండ్ల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి



రెంజల్(బోధన్): రెంజల్‌లోని శాఖ గ్రంథాలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి సూచించారు. మండలకేంద్రంలో జరుగుతున్న పనులను ఆయన సోమవారంపరిశీలించారు. జిల్లాలోని శాఖ గ్రంథాలయాల్లో నిరుద్యోగులకు కావాల్సిన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులోకి తీసుకవస్తున్నట్లు వివరించారు. అంతకు ముందు తాడ్‌బిలోలి, సాటాపూర్ గ్రామాల్లో రైతులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేషనల్ హైవే భూ నిర్వాసితులకు తనవంతు సహకారం అందిస్తానని అన్నారు.

బోధన్ బల్దియా సమావేశంలో 27 అంశాలకు ఆమోదం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం బల్దియా చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశంలో ఎజెండా అంశాలు 20తో పాటు అదనంగా మరో 7ఎజెండా అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ వార్డుల్లో పలు అభివృద్ధి పనులు నిర్వహించడానికి 27 అంశాలను కౌన్సిల్ సభ్యుల ముందు ఉంచగా అమోదం తెలిపారన్నారు. కమిషనర్ వెంకట నారాయణ, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జా నుంచి భూమిని కాపాడండి



బాల్కొండ: కబ్జా గురైన తమ గ్రామానికి చెందిన భూమిని కాపాడాలని మెండోరా మండలం సోన్‌పేట్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముందర బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబరు 329లో గల గ్రామానికి చెందిన ఎకరం భూమిని గ్రామానికి చెందిన ప్రభాకర్ అన్యాయంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీదర్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

'వేసెక్టమీ' శిబిరాన్ని విజయవంతం చేయాలి



కమ్మర్‌పల్లి: మోర్తాడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 23న నిర్వహించే వేసెక్టమీ ఆపరేషన్‌ల శిబిరాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉప వైద్య,ఆరోగ్యశాఖ అధికారి రమేష్ అన్నారు. మండలంలోని చౌట్‌పల్లి, కమ్మర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పురుషులకు శాశ్వత కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌తో ఎలాంటి కోత, కుట్టు ఉంటుందన్నారు. ఆపరేషన్ శిబిరంపై గ్రామాల్లో దండోరా వేయించాలని సిబ్బందికి సూచించారు. డాక్టర్ స్పందన, హెచ్‌ఈవో సత్యనారాయణ, సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి సీపీఎం రాష్ట్ర సభలు

ఆర్మూర్‌టౌన్/బోధన్/నవీపేట: సంగారెడ్డిలో ఈనెల 25నుంచి 28వరకు సీపీఎం పార్టీ రాష్ట్ర మహా సభలను నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈమేరకు మహా సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం ఆర్మూర్, బోధన్, నవీపేట మండలాల్లో స్థానిక నాయకులు ఆవిష్కరించారు. నాయకులు పల్లపు వెంకటేష్, జంబిశెట్టి శంకర్‌గౌడ్, నాయక్‌వాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు తరలిరావాలి



రుద్రూర్: జిల్లా కేంద్రంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ఆశా కార్యకర్తల పాదయాత్రకు తరలిరావాలని పోతంగల్ మండల ఆశావర్కర్స్ యూనియన్ కార్యదర్శి రేష్మ పిలుపునిచ్చారు. పాదయాత్రకు సంబంధించిన వినతిపత్రాన్ని సోమవారం పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నాయకులు నన్నేసాబ్, స్రవంతి, పుష్పలత, నాగమణి, కళావతి, లింగమణి, లత, అనిత, శాంత, రుక్మిణి, పోశవ్వ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి



రుద్రూర్: కోటగిరి మండలంలో ఆక్రమణకు గురవుతున్న సాగునీటి కాలువలు, ప్రభుత్వ భూములను కాపాడాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు కోటగిరి తహసీల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ మాట్లాడుతూ.. అధికారులు వెంటనే సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉమాకాంత్ రావ్, పోచిరాం, గంగారాం, సాయిలు తదితరులు ఉన్నారు.

చెక్కుల పంపిణీని అడ్డుకోవడం సరికాదు



బాల్కొండ: బాల్కొండ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయకుండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అడ్డుకోవడం సరికాదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ అన్నారు. ఈమేరకు ఆయన సోమవారం తహసీల్దార్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశాడు. ప్రజలపై రాజకీయాలు చేయాలనే కక్షతో చెక్కుల పంపిణీని బహిష్కరిస్తున్నట్లు తనకు తానే చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలపై రాజకీయాలు ఆపి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చెక్కులను బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నిలిపివేయించడం సరికాదని కాంగ్రెస్ నాయకుడు, జిల్లా టెలికం బోర్డు సభ్యుడు తక్కూరి సతీష్ అన్నారు. సోమవారం ఆయన మోర్తాడ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే తమ స్వార్థం కోసం లబ్ధిదారులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదని అన్నారు.

ఆధ్యాత్మికం..



■ **సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు**

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దులగుట్ట పైగల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగానికి పంచామృతంతోపాటు బిల్వ పత్రాలతో అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం స్వీకరించారు.

సంక్షిప్తం

కఠిన చర్యలు తీసుకోవాలి



నందిపేట్(ఆర్మూర్): అయ్యప్ప స్వాములను అవమాన పరిచారని అకారణంగా తుక్కుగూడ హెచ్‌ఎం రాములుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నందిపేట్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. పాఠశాలలో సోమవారం వారు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

రుద్రూర్: తుక్కుగూడ హెచ్‌ఎంపై దాడిని నిరసిస్తూ కోటగిరి హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పీఆర్టీయూ నాయకులు, టీచర్లు ఉన్నారు.

రైతు సంఘంలో చేరికలు

మాక్లూర్: మండలంలోని బోర్గాం(కె) గ్రామంలో సోమవారం మండల ఏఐకేఎంఎస్ నాయకులు, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘంలో చేరారు. నాయకులు రామకృష్ణ, కృష్ణగౌడ్, నగేష్, శంకర్‌గౌడ్, నితిన్, శ్రీనివాస్, అన్వేష్, కిషాన్, దేవారాం, గంగాధర్, బాబన్న ఉన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

రుద్రూర్: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని కోటగిరి మండల ఎమ్మార్పీస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

రెంజల్(బోధన్): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో సోమవారం భారత రాజ్యాంగ రక్షణ సభ వాల్‌పోస్టర్లను సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈనెల 23న జిల్లా కేంద్రంలో నిర్వహించే సభకు ప్రజలు భారీగా తరలిరావాలన్నారు. నాయకులు పార్వతి రాజేశ్వర్, క్రాంతికుమార్, పోశెట్టి, గంగయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చిందు కళాకారిణికి సన్మానం

నవీపేట: చిందు యక్షగాన కళారంగంలో రాణిస్తున్న పులింటి గోదావరి ఇటీవల చిందు యక్షగాన కళా రత్న ఆర్యాణి సకల కళావేదిక జాతీయ పురస్కారం అందుకుంది. ఈసందర్భంగా సోమవారం ఆమెను బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. నాయకులు బండారి రాజశేఖర్, శ్రీనివాస్‌గౌడ్, పిల్లి శ్రీకాంత్, రాధ, గణేష్, రాము, బాల గంగాధర్, గోపాల్, ప్రవీణ్, రమేష్, వీరేందర్, గంగాధర్ నర్సింలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు క్విజ్ పోటీలు



మోర్తాడ్: ఏర్గట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం విద్యాశాఖ, ఎన్‌జీవో సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఎన్‌జీవో ప్రతినిధులు మల్లికార్జున్, సరిత, హెచ్‌ఎం కృష్ణాచారీ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్‌కు చెందిన మహ్మద్ షరీఫ్‌కు వైద్య చికిత్స కోసం రూ.2.50లక్షల ఎల్‌వోసీని సోమవారం కాంగ్రెస్ నాయకులు అందించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి చొరవ తీసుకుని ఎల్‌వోసీ అందించారని వారు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు..

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో ఓ బాధిత కుటుంబానికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. నాయకులు టక్కర్ గంగాధర్, గుడాల మోహన్, గడ్డల నర్సయ్య, సాయిరాం, రాజేందర్, రవి పాల్గొన్నారు.

వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలి


ఆర్మూర్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో మంగళవారం నుంచి నిర్వహించే వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషన్ రాజు అధికారులకు సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 21 నుంచి 24వరకు జరిగే వార్డు సభలలో సంక్షేమ పథకాలకు అర్హులైన వారి జాబితాలో ఉన్న వారి పేర్లను తెలిపాలన్నారు. పేర్లు రాని లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి రేషన్ కార్డుకు, ఇందిరమ్మ ఇళ్లకు, వేరువేరుగా రిజిస్టర్లు ఏర్పాటు చేసుకొని వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మంగళవారం 23, 9, 4, 3, 30, 5, 8, 1, 18, 31వ వార్డులో సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్వో ఉమాదేవి, టీపీవో అంజనేయులు, సానిటరీ ఎస్సై గజానంద్, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, వార్డ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని వార్డుల్లో నేటి నుంచి 24వరకు వార్డు సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు అర్హుల ఎంపిక కోసం వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హుల జాబితాలో లేనివారు వార్డుల్లో నిర్వహించే వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వార్డు సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి గ్రామ సభలు

బాల్కొండ: గత వారం రోజులుగా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలపై నిర్వహించిన సర్వే నివేదికలను చదివి వినిపించుట కోసం మంగళవారం నుంచి గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించనున్నట్లు బాల్కొండ, ముప్కాల్ మండలాల ఎంపీడీవోలు విజయభాస్కర్‌రెడ్డి, నరేష్ ఆనంద్‌లు సోమవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. రెంటు టీంలుగా ఏర్పడి గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నేడు బాల్కొండ మండలంలోని వన్నెల్(బి), బోదేపల్లి, శ్రీరాంపూర్, చిట్టాపూర్ గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న కిసాన్‌నగర్, బస్సాపూర్, జలాల్‌పూర్, ఇత్వార్‌పేట్, 23న బాల్కొండ, నాగాపూర్‌లో గ్రామసభలు నిర్వహించనున్నారు. ముప్కాల్ మండలంలో 21న కొత్తపల్లి, వేంపల్లి, నాగంపేట్‌లో 22న వెంచిర్యాల్, నల్లూర్, రెంజర్ల, 23న ముప్కాల్‌లో నిర్వహించనున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలి



మోర్తాడ్: సుప్రీం కోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ దండోరా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నాయకులు మునిగె రవి, సుమన్, సీహెచ్ గంగాధర్, నాగభూషణం, తెడ్డు సంజీవ్, కల్లెడ గంగాధర్, కడారి రాజేష్, నిమ్మ రాజు, నాగం పోషన్న పాల్గొన్నారు.

అంక్సాపూర్‌లో సంత ప్రారంభం



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో సోమవారం వారంతపు సంతను వీడీసీ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంత ఏర్పాటుతో తమ గ్రామస్తులు, వ్యాపారులు కూరగాయలు, ఇతర వస్తువులు విక్రయించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామస్తులతోపాటు పోచంపల్లి, కుకునూర్, కోమన్‌పల్లి, కొత్తపల్లి ఎన్, అంక్సాపూర్, పడగల్ ఒడ్డెర కాలనీల వారికి సరుకులన్నీ సమీపంలో లభించే సౌకర్యం ఏర్పడుతుందని వెల్లడించారు.

సిద్దిపేట ఎమ్మెల్యేను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి



నిజామాబాద్‌అర్బన్: సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావును సోమవారం నిజామాబాద్, మెదక్ అదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మాచర్ల గిరిధర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని హరీష్ రావును కోరారు.

డైరీ ఆవిష్కరణ

మోర్తాడ్: తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం డైరీని సోమవారం మోర్తాడ్ ఎంఈవో దొర్ల సమ్మిరెడ్డి ఆవిష్కరించారు. హెచ్‌ఎంలు ప్రభాకర్, సర్దార్ మోహినోద్దిన్, వేణుగోపాల్‌రావు, రఘునందన్‌చారీ, వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.


కప్పేసిన మంచు దుప్పటి

జిల్లాను మంచు దుప్పటి కప్పేసింది. సోమవారం ఉదయం పొగ మంచు భారీగా కురిసింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. – బాల్కొండ

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	గేమ్ ఛేంజర్(తెలుగు)- 12.00, 3.20, 6.40, పుష్ప-2(తెలుగు)-10.00
స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) - 10.00, 1.00, 4.00, 7.00, 10.00
స్క్రీన్-3	డాకు మహారాజు (తెలుగు)- 10.10, 1.15, 4.20, 7.25, 10.30
స్క్రీన్-4	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు) - 12.00, 3.00, 6.00, 9.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.45,4.30,7.25, 10.20
స్క్రీన్-2	గేమ్‌ఛేంజర్ -1.10,7.35 10.35 డాకు మహారాజు(తెలుగు)-4.30
స్క్రీన్-3	డాకుమహారాజు(తెలుగు)-11.00, 7.35,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 10.10, 1.10, 4.10, 7.10, 10.10
స్క్రీన్-2	డాకు మహారాజు (తెలుగు)- 10.20, 1.25, 7.35, 10.40 ఎమర్జెన్సీ(హిందీ)-4.30
స్క్రీన్-3	గేమ్ ఛేంజర్(తెలుగు)- 12.00, 3.20, 6.40 ఎమర్జెన్సీ(హిందీ)-10.00
స్క్రీన్ -4	ఎమర్జెన్సీ(హిందీ)-12.00 ఆజాద్(హిందీ)-3.05, 10.15 పుష్ప-02(తెలుగు)-6.10
లలితామహల్	గేమ్ ఛేంజర్(తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	80,900	వెండి(కిలో)	95,000
22 క్యారెట్స్	74,650		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800